

# ఒక చల్లని మేఘం

డా॥ ఎం. హరికిషన్

మురళి బ్యాట్ పట్టుకుని రెడీగా నిలబడ్డాడు. లత తడబడుకుంటూ నాలుగడుగులు ముందుకేసి బలంగా బంతి విసిరింది. అది నేల మీద నాలుగు పిల్లిమొగ్గలేసి బ్యాట్తో కొట్టక ముందే ఆగిపోయింది.

మురళి చెల్లెలి వంక కోపంగా చూస్తూ, "ఏయ్... పిచ్చిపిల్లా... సరిగ్గా వెయ్యలేవా," అన్నాడు.

లత పెదాలు సున్నాలా చుట్టి, "నేనేం పిచ్చిపిల్లను కాను. మన్చిపిల్లను," ముద్దుముద్దుగా అంది. మురళి నవ్వుతూ చెల్లిని మరింత ఉడికించడానికి, "నువ్వేం మన్చిపిల్లవుకాదు. పిచ్చికుక్కవి," అన్నాడు. లత ఉక్రోషంగా తలెత్తి "నేనేం పిచ్చికుక్కను కాను. నువ్వే పిచ్చికుక్కవి. నేను మన్చికుక్కను," అంది. మురళి పగలబడి కిలకిలమని నవ్వసాగాడు. అన్నయ్యెందుకు నవ్వుతున్నాడో అర్థంగాక, "నీతో అన్ను ఫో... కచ్చి," అంటూ లత అన్నించి వెళ్లిపోయింది.

మురళి నవ్వుకుంటూ బ్యాట్ భుజంపై పెట్టుకొని బైటికి పోడానికి కదిలాడు. అంతలో వాళ్ల నాన్న సంచీతో లోపలి కడుగుపెట్టాడు. కొడుకు చేతిలో బ్యాట్ చూసి,

"రేయ్... ఏందిరా... ఎప్పుడూ వెధవాటలూ నువ్వూనూ. వచ్చినప్పన్నించి చూస్తున్నా... ఎప్పుడన్నా పుస్తకం తెర్చి పట్టుమని పది నిముషాలన్నా కూర్చున్నావా. సందు దొరుక్తే చాలు బైటకురుక్తావ్. ఐపాయలే. ఇదే ఆఖర్రోజు. ఇంతకీ అన్నీ సర్దుకున్నావా... లేదా... ఇదిగో స్కూల్ డ్రస్. సూట్కేస్లో పెట్కో. రేప్పొద్దున్నే బైల్దేరాల," అంటూ సంచీ అందించాడు.

మురళికొక్కసారిగా నీరసమావరించింది. బట్టల్తీస్కోని కాళ్లీడుస్తూ రూంలోకి చేరుకున్నాడు. స్కూలు గుర్తుకు రాగానే కళ్లనిండా నీళ్లు కమ్ముకొన్నాయి. మంచమ్మీద వాలిపోయాడు. అంతలో లతొచ్చి చేయి పట్టుకొని లాగుతూ, "అనా... దానా... ఆకుందాం. నువ్వు బాలెయ్యి. నేను కొడ్తా," అంది. మురళి విసుగ్గా "యేయ్... పోతావా లేదా ఈన్నించి," కసురుకుంటూ విసురుగా దొబ్బాడు. లత గోడకు కొట్టుకొని కిందపడి ఏడుస్తూ బైటికి పోయింది.

మురళి ఒంటరిగా పండుకున్నాడు. పదేపదే స్కూలు, వార్డెను, టీచర్లు, బెత్తాలు గుర్తుకు రాసాగాయి. రాత్రి అన్నం సయించలేదు. నిద్ర రాలేదు. పొద్దున్నే తండ్రి వెంట సూట్కేస్తో మౌనంగా బైల్దేరాడు. లత చిరునవ్వుతో టాటా చెప్పసాగింది. మురళికి పోవాలన్పించడం లేదు. దుఃఖం తన్నుకొస్తా వుంది. మొదట్లో పోడానికి నానా గందరగోళం చేసేవాడు. ఏడ్చేవాడు. కిందామీదా పడి పొర్లేవాడు. దొరక్కుండా పారిపోయేవాడు. ఎలాగోలా పట్టుకొనేవారు. కొట్టి తిట్టి, బలవంతంగా ఈడ్చుకు పోయేవారు. ఏమ్చేసినా లాభం లేదని తర్వాత్తర్వాత గ్రహించాడు. అప్పన్నించీ మౌనంగా వెళ్లడం నేర్చుకున్నాడు.

బస్సు బైల్దేరింది. ఊరు దూరం కాసాగింది. దిగులుగా కిటికీలోంచి అలాగే చూడసాగాడు. కాసేపటికి కళ్లు మూతలుపడ్డాయి. నాన్న లేపుతూంటే మెలకువొచ్చింది. బస్సు కర్నూల్ బస్టాండ్లో ఆగి వుంది. ఆటో మాట్లాడుకొని వూరి బైటున్న స్కూలుకి చేరారు. తండ్రి ఆఫీస్ రూమ్లో ఫీజులు కట్టాడు. వాళ్ల సంరక్షణలో మురళిని వొదిలి వెళ్లిపోతూ...

''బాగా బుద్ధిగా చదువుకో. ఇప్పున్నువ్ సెవెన్త్ క్లాస్. పబ్లిక్. మార్క్సు అదిరిపోవాలి. అందరి ముందు నేను తలెత్తుకొని గర్వంగా తిర్గాలి. నీకోసం యెంత ఖర్చు పెడ్తున్నానో చూస్తున్నావు గదా. జాగ్రత్త. అల్లరి చిల్లరిగా తిరగొద్దు. ఏదైనా కంప్లయింటొచ్చిందనుకో... నా గురించి తెల్సుగదా... కాళ్లు చేతులిరగ్గొట్టి రైలుకింద పన్నబెడ్తా. ఈసారి క్లాస్ ఫస్ట్ రావాలి. గుర్తుంచుకో,'' అంటూ వెళ్లిపోయాడు. మురళికి టాటా గూడా చెప్పా లనిపించలేదు. బ్యాగు సంకకు తగిలించుకొని కాళ్లీడ్చు కుంటూ హాస్టల్ వైపు అడుగులేయసాగాడు.

''హలో!'' వెనుక నుంచి భుజమ్మీద చెయ్ పడింది. తలతిప్పాడు. తన రూమ్మేట్. ''ఏయ్! హరీ! బాగున్నావా... ఎప్పుడొచ్చావ్'' ఆనందంగా చెయ్యి కలుపుతూ ప్రశ్నించాడు.

''నెలైందిలే... మనం లెక్కల్లో డల్ గదా. ఈ నా కొడుకులు డబ్బుల్కోసం సమ్మర్లో ఇంప్రూవ్‌మెంట్ కోచింగ్ పెట్నారు. మా ఇంట్లో నన్ను భరించలేక ఈన్నే పడేసిపోయినారు. దొంగ నాకొడుకులు,'' గట్టిగా నవ్వే శాడు.

''అరెరే... ఐతే సెలవులంతా ఈన్నేవున్నావా,'' మురళి సానుభూతిగా అన్నాడు. హరి తలూప్తూ, ''ఐనా ఇంకెన్ని రోజుల్లే. చూస్తుండు. ఈసారి ప్లాన్ కరెక్టుగా వేస్తున్నా. చచ్చినా దొరకను,'' అన్నాడు.

మురళికి అంతకుముందు సంవత్సరం జరిగింది గుర్తుకొచ్చింది. ఒళ్లు భయంతో వణికింది. ఓరోజు పొద్దున్నే హరి కడుపునొప్పంటూ పడిపోయాడు. గిల గిలా కొట్టుకోసాగాడు. ఏవేవో మందులు తెప్పించారు. తగ్గలేదు. కర్నూలుకి వార్డెన్ని తోడిచ్చి పంపారు. వార్డెన్ డాక్టర్తో మాట్లాడ్తున్నప్పుడు హరి నెమ్మదిగా జారు కున్నాడు. గంటలో విషయం స్కూలు సిబ్బందికి తెల్సి పోయింది. వెంటనే ఎలర్టయ్యారు. వేట మొదలెట్టారు. సాయంత్రం రైలెక్కబోతూ స్టేషన్లో దొరికిపోయాడు.

తర్వాత రోజు ప్రేయర్లో అందరిముందూ విపరీ తంగా కొట్టారు. రెండు చేతులూ విరిచికట్టి గ్రౌండ్లో అందరికీ కనబడేటట్లు సాయంత్రం వరకు ఉంచారు. వారంరోజులు రూంలో ఒక్కన్నే బందీ చేశారు. యెంత చేసినా హరి చెక్కుచెదర్లేదు. ఏడ్వలేదు. కొడ్తుంటే వాళ్ల వంక సూటిగా చూస్తుండేవాడు. ఆ కళ్లలో కోపం, అసహ్యం, కసి, నిర్లక్ష్యం ఉట్టిపడేవి.

క్లాసులో విపరీతంగా అల్లరి చేసేవాడు. గోడల మీద ఏవేవో రాసేవాడు. టీచర్లను లెక్కజేసేవాడు కాదు. తోటిపిల్లలతో ఎప్పుడూ గొడవలు పెట్టుకొనేవాడు. అందరూ వాన్ని తిట్టేవారు. మొద్దబ్బాయని ఎగతాళి చేసేవారు. కానీ మురళికి వాడు ఓ హీరోలా కన్పించే వాడు. ఇద్దరూ ప్రాణస్నేహితులయ్యారు. కలిసి తిరిగే వారు. ఆడుకునేవారు. మనసు విప్పి మాట్లాడు కొనేవారు.

''యేందిరా ఆలోచిస్తున్నావ్,'' హరి ప్రశ్నతో మురళి ఈ లోకంలోకొచ్చాడు. ఇద్దరూ మాట్లాడు కొంటూ రూం చేరుకున్నారు. తరువాత రోజు నుండి యాంత్రిక జీవితం ప్రారంభమైంది.

*

ఓరోజు మధ్యాన్నం భోజనం ముగించి ఇద్దరూ రూంకి చేరుకున్నారు. మురళి అలసటగా మంచమ్మీద వాలిపోయాడు. హరి వానిపక్కన కూర్చొని, ''రేయ్! నిన్న రాత్రి మన్చి బొమ్మేశాను తెల్సా,'' అన్నాడు. మురళి లేచి కూర్చుంటూ, ''యేదీ... చూపియ్... చూపియ్,'' ఆసక్తిగా అడిగాడు.

హరి తలుపులు మూసి గడేశాడు. బుక్కుల కింద జాగ్రత్తగా దాచిన బొమ్మనీస్కొచ్చి మంచమ్మీద పరిచాడు. మురళి ఆత్రంగా దానొంక చూశాడు. అందులో ఒకడు నేలమీద వెల్లకిలా పడున్నాడు. దాదాపు నలభైయేళ్లుంటాయి. వాని గుండెల మీద చిన్న పిల్లవాడు కూర్చొని గొంతు పిసుకుతున్నాడు.

బొమ్మను పరిశీలనగా చూస్తున్న మురళితో, ''ఆ కిందున్నోడెవడో కనుక్కో చూద్దాం,'' అన్నాడు హరి.

''మన హెడ్మాస్టర్,'' మురళి ఠక్కున సమాధాన మిచ్చాడు. కాదన్నట్టు హరి తలడ్డంగా ఊపాడు. మురళి ఒక్కక్షణమాలోచించి, ''మన వార్డెన్. కరెక్టేనా,'' అన్నాడు. హరి పెదవి విరిచాడు. మురళి దీర్ఘంగా ఆలో చించసాగాడు. ఎవరో అర్థంకాక, ''నువ్వే చెప్పురా,'' అన్నాడు.

హరి అదిగూడా తెలీదా అన్నట్లుగా చూసి, ''మా నాన్న,'' అన్నాడు ఫక్కున నవ్వుతూ. మురళి నవ్వుతున్న హరి వంక అలాగే చూశాడు. కళ్లూ కళ్లూ కలిశాయి. కాసేపటికి మురళి పెదాల మీద కూడా చిరునవ్వు చేరింది. హరి భుజమ్మీద చేయేసి, ''మీ నాన్నేగాదు. మా నాన్న గూడా,'' అన్నాడు. నవ్వులతో రూము మార్మోగింది.

*

హరి ప్రతిరోజూ ఏవేవో పక్షుల ఈకలు తెచ్చి రూంలో దాచిపెట్టసాగాడు. గూళ్లలో, పుస్తకాలలో,

మంచం కింద... ఎక్కడ చూసినా ఈకలు నిండిపోసాగాయి. మురళికేమీ అర్థంకాలేదు. "ఎందుకురా ఇవన్నీ," చాలాసార్లడిగాడు. "చెబ్తాలేరా... ఇప్పుడు గాదు," హరి ప్రతిసారి దాటవేయసాగాడు.

ఓరోజు అర్ధరాత్రి తడుతుంటే మురళికి మెలకువొచ్చింది. ఎదురుగా హరి. "ష్" అంటూ చేయి పట్టుకొని, "నాతోరా," అన్నాడు. నిశ్శబ్దంగా తలుపు తెరిచాడు. కారిడార్లో ఎవరూ లేరు. మురళి చేయి పట్టుకొని అడుగులో అడుగు వేసుకుంటూ మెట్లవద్దకు చేరుకున్నాడు. ఒక్కొక్క అంతస్తూ ఎక్కుతూ డాబా మీదకు చేరుకున్నారు. అమావాస్య. చీకటిగా ఉంది. దూరం నుండి బార్లైట్ వెలుగు మసకమసకగా ప్రసరిస్తోంది. మురళికి అంతా అయోమయంగా ఉంది.

"ఒక్క నిముషం," అంటూ ఓ పెద్దబండ చాటు నుంచి ఏవో తీసుకొచ్చాడు. ధగధగా మెరిసిపోతున్నాయి. పరిశీలనగా చూశాడు. ఆశ్చర్యంతో కళ్లు పెద్దగయ్యాయి. రెక్కలు... అందమైన రంగు రంగుల ఈకలు... మనోహరమైన రెక్కలు. "ఎందుకివి," మురళి ఆత్రంగా ప్రశ్నించాడు.

హరి మిలమిలలాడే కళ్లతో, వాటిని ఆప్యాయంగా నిమురుతూ, "ఎగిరిపోడానికి," అన్నాడు.

"ఎగిరిపోవచ్చా," మురళి కళ్లలో ఆశ్చర్యం. హరి ఔనన్నట్లుగా తలూప్తూ,

"ఈ రెక్కల గురించి నీకింతవరకు చెప్పలేదు గదూ... నాక్కూడా మొన్న వేసవి సెలవుల్లోనే తెలిసింది. మా ముందింట్లో ఇమ్మానియేలని ఒకడున్నాడ్లే. వాడు నేర్పాడు వీటినెలా చేయాలో. ఇక్కడ మంచి ఈకలు దొరకలేదుగానీ... ఇంటి దగ్గర యెంత అద్భుతంగా తయార్చేశానో తెల్సా. రంగురంగుల చిన్నిచిన్ని పక్షుల ఈకలతో... మధ్యన కాంతులీనే మనోహరమైన నెమలి పింఛాలతో... అబ్బ... చెప్పలేను. చూచి తీరాల్సిందే. రెండు భుజాలకూ కట్టుకొన్నాను. ఒక్కమాటున గాలిపటంలా రివ్వున పైకెగిరా... అలా అలా గాలిలో తేలిపోతూ... పైకి పైపైకి... నల్లని మబ్బుల్లోకి... చెట్లు, బిల్డింగులు, రైళ్లు... చిన్నగా... మరింత చిన్నగా... ఆటబొమ్మల్లా...

"దూరంగా... తెల్లని మంచుపర్వతం. చల్లనిగాలి. సువాసనలు వెదజల్లుతున్న రంగు రంగుల పూలు. విశాలమైన పచ్చనిచెట్లు. మనోహరమైన పక్షులు. కొండల మీంచి జలజలా దూకుతున్న సెలయేళ్లు... వాటి మధ్య... ఎక్కడ చూసినా... యెటు చూసినా... పిల్లలు... చిన్నచిన్న పిల్లలు. మనీడు పిల్లలు. చిన్నిచిన్న రెక్కలతో... నవ్వుతూ, తుళ్లుతూ, ఎగురుతూ... నన్ను చూసి చిరునవ్వులు చిందించారు. కేరింతలు కొట్టారు. తమలోకి ఆహ్వానం పలికారు.

"అక్కడ నాన్నల్లేరు. అమ్మల్లేరు. టీచర్లు లేరు... భోజనం గంటల్లేవు. ప్రార్థన పిలుపుల్లేవు. బలవంతపు చదువుల్లేవు... బూట్లు లేవు. టక్కుల్లేవు. టైలు లేవు... అరుపులు, తిట్లు, తన్నులు అస్సల్లేవు. మనకోసం, మనలాంటి బాలల కోసం దేవుడెంతో శ్రమించీ, శ్రమించీ సృష్టించిన అద్భుతలోకమది.

"మేము నీళ్లలో చేపలమయ్యాం. చెట్లలో కోతులమయ్యాం. ఆకాశంలో పక్షులమయ్యాం. కోయిలలమయ్యాం. లేగదూడలమయ్యాం. కుక్కపిల్లలమయ్యాం... మాకోసం చెట్లు పండ్లిచ్చాయి. పూలు తేనిచ్చాయి. చెరువులు నీళ్లిచ్చాయి. ఎండ వెన్నెలైంది. ముళ్లు పూలయ్యాయి. రాళ్లు రబ్బరుముక్కలయ్యాయి... చినిగిన అంగీలతో, రేగిన జుట్టుతో, మట్టికొట్టుకున్న ఒంటితో... ఎగిరాం, ఎగిరి దుంకాం. కింద పడ్డాం. లేచాం. కొట్టుకున్నాం. దొబ్బుకున్నాం. మమ్మల్ని చూసి చెట్లు నవ్వాయి. పువ్వులు నవ్వాయి. కొండలు నవ్వాయి.

"చీకటి ఎప్పుడౌతాదో తెలీదు. చందమామ ఎప్పుడొస్తాడో తెలీదు. గంటలు క్షణాలయ్యేవి. కళ్లు మూసి తెరచినట్టుగా ఉండేది. కలలాగా ఉండేది. టాటాలు చెప్పుకుంటూ, రేపటి గురించి కలలు కంటూ, వీడ్కోలు తీసుకునేవాళ్లం. సూర్యోదయంకోసం ఆతృతగా ఎదురు చూసేవాన్ని. మళ్లా పొద్దున్నే... రెట్టించిన ఉత్సాహంతో... అమ్మానాన్నా బైటికిపోగానే... ఎగురుతూ, వురుకుతూ వాళ్లలో కలిసిపోయేవాన్ని. కానీ..." హరి చెప్పడమాపేశాడు. కళ్లు వర్షించే మేఘాలయ్యాయి. గొంతు వణికింది.

"ఏమైంది... తర్వాతేమైంది," మురళి కుదుపుతూ ప్రశ్నించాడు. కన్నీళ్లు తుడుచుకుంటూ హరి కొనసాగించాడు.

"ఎలా తెలిసిందో అమ్మానాన్నలకు. తిట్టలేదు. కొట్టలేదు. ప్రశ్నించలేదు. ఎప్పట్లాగే ఓ రోజు ఇద్దరూ ఉద్యోగానికెళ్లగానే పరుగు పరుగున గదిలోకి చేరుకున్నా. మంచం కింద రెక్కలు కనబల్లేదు. వెతికాను. ఇల్లంతా... అణువణువునా. ఏడుస్తూ... కిందా మీదా బడుతూ... ఎక్కడా... ఎక్కడా కనబల్లేదు. ఆఖరికి వంటగదిలో... పొయ్యిలో... కాలిబూడిదైపోయి...

“పిచ్చివానిలా కేకలు పెట్టాను. పొర్లిపొర్లి ఏడ్చాను. తాళం వేసి వున్న తలుపుకు తల బాదుకున్నాను. శాపనార్థాలు పెట్టాను. బూతులు తిట్టాను. ఆ తరువాతరోజే తీస్కొచ్చి నన్నిక్కడ పడేశారు.

“అప్పన్నించి కన్ను మూస్తే అదే కల. చేతులు చాచి ఆహ్వానిస్తున్న స్నేహితులు. ఎలాగైనా వాళ్లను చేరుకోవాలనుకున్నా. కాంపౌండంతా గాలించా. ఒక్కొక్క ఈకనే ఏరి దాచిపెట్టసాగా. ఇన్నాళ్లకు రెక్కలకు సరిపడా ఈకలు దొరికాయి. నాలుగురోజులుగా రాత్రుళ్లు మిద్దెపై కూర్చొని దీన్ని తయారుచేశా. బాగున్నాయి కదూ,” రెక్కలను గాల్లో ఆడించాడు.

హరి మొహం చందమామలా వెలిగిపోతా వుంది. చిరునవ్వు పెదాల మీది నుండి జల పాతంలా దూకుతా ఉంది.

మురళి వంక చూస్తూ, “వస్తావా,” అన్నాడు. మురళికి వెళ్లాలనిపించింది. ఆ కొత్తలోకాన్ని చూడాలని మనస్సు వువ్విళ్లూరింది. కానీ ఏదో భయం... తటపటాయింపు... విషాదవదనంతో, “ఈసారి వస్తాలే,” అన్నాడు.

హరి చిరునవ్వుతూ అంచు మీదికెక్కాడు. అమావాస్య. నల్లని చీకటి. స్కూలు చుట్టూ ఎత్తైన ప్రహరీగోడ మసకమసకగా కనబడుతోంది. మురళివంక చూశాడు. ఆప్యాయంగా చేతిని నొక్కివదుల్తూ, “వస్తాను,” అంటూ చేయూపాడు. మురళి కన్నీళ్లతో, నిరాశతో వీడ్కోలు చెబ్తూ చేయెత్తాడు.

హరి శక్తినంతా కూడగట్టుకొని, డాబా అంచు మీది నుండి ఒక్కుదుటున గాల్లోకెగిరాడు. అంతే... సర్రున నేలమీదకు జారిపోసాగాడు. రెక్కలు గాల్లో వేగంగా టపటపా కొట్టుకుంటున్నాయి. మురళి అదిరిపడి ‘హరీ’ అంటూ బిగ్గరగా అరుస్తూ, డాబా చివరకొచ్చి కిందికి తొంగిచూశాడు. చీకటిలో ఏమీ కనబల్లేదు. ఆకాశం ఎర్రగా భీతిగొల్పుతూ వుంది.

*అరుణతార, అక్టోబర్-నవంబర్ 2002*

